భక్తులతో కలిసి..

● వెంకయ్య నాయుడు అన్నప్రసాదాల స్వీకరణ



శ్రీవారి దర్శనార్థం తిరుమల చేరుకున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడికి క్యాప్రి అతిథి గృహం వద్ద టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. కాసేపు విశ్రాంతి అనంతరం వెంకయ్య నాయుడు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనానికి వెళ్లి భక్తుల మధ్య కూర్చుని అన్నప్రసాదాలు స్వీకరించారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి అన్నప్రసాదాల వితరణ గురించి వెంకయ్యనాయుడికి వివరించారు. అనంతరం శ్రీవారిసేవకులతో పాటు అన్నప్రసాదాలు స్వీకరించేందుకు వచ్చిన భక్తులతోనూ వెంకయ్య నాయుడు ముచ్చటించారు. అన్నప్రసాదాలపై తన అభిప్రాయాన్ని కామెంట్ పుస్తకంలో రాశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

స్వామి దర్శనానికి గవర్నర్



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న టీటీడీ ఈవో

శ్రీవారి దర్శనానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ కుటుంబ సమేతంగా ఆదివారం తిరుమల వచ్చారు. పద్మావతి అతిథి గృహం వద్ద టీటీడీ ఈవో శ్యామలరావు స్వాగతం పలికారు. ఉదయం 10 గంటలకు ఆలయం వద్ద గవర్నర్‌కు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, అధికారులు, అర్చకబృందం ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. అనంతరం స్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సేవలో సీఎస్



తిరుమలేశుడిని ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు, డైరీ, క్యాలెండర్, శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి ఈవో, అదనపు ఈవో వివరించారు. తిరుమలలోని ఛైర్మన్ కార్యాలయానికి వెళ్లిన విజయానంద్ బీఆర్ నాయుడితో వివిధ అంశాలపై చర్చించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

మరో ప్రయోగానికి షార్ సిద్ధం



రాకెట్‌లోని మొదటి దశ

రాకెట్: జీఎస్ఎల్వీ-ఎఫ్ 16
పొడవు: 50.9 మీటర్లు
ఉపగ్రహం: నిసార్
బరువు: 2,392 కిలోలు
ప్రయోగ సమయంలో రాకెట్ బరువు: 420.7 టన్నులు
రాకెట్ ఎగిరేది: 30వ తేది సాయంత్రం 5.40 గంటలకు



అనుసంధానం అనంతరం వ్యాబ్ నుంచి ప్రయోగ వేదికకు తరలిస్తున్న జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్






రెండో దశ

మూడు దశల అనుసంధానంతో జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్



మూడో దశ



ఉష్ణ కవచం ఏర్పాటు దశలో.. ఏర్పాటు చేశాక నిసార్ ఉపగ్రహం

మరో ప్రయోగానికి షార్‌లోని రెండో ప్రయోగ వేదిక సిద్ధమైంది. ఇస్రో-నాసా సంయుక్తంగా రూపొందించిన నిసార్ ఉపగ్రహాన్ని జీఎస్ఎల్వీ-ఎఫ్ 16 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపేందుకు శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేశారు. పీఎస్ఎల్వీ రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగిస్తే.. దీనిని మూడు దశల్లోనే ప్రయోగిస్తారు. వ్యాబ్‌లో రాకెట్ మూడు దశల అనుసంధానం పూర్తిచేసి రాకెట్ శిఖర భాగాన ఉపగ్రహాన్ని అమర్చారు. ప్రయోగ వేదిక పైఉన్న రాకెట్‌కు లెవల్-1, లెవల్-2 తనిఖీలు పూర్తిచేసి ప్రీ కౌంట్‌డౌన్ నిర్వహించి రిహార్సల్‌ను విజయవంతంగా నిర్వహించారు. రాకెట్ దశల వారీగా అనుసంధానించే చిత్రాల దృశ్యాలను ఇస్రో ఆదివారం విడుదల చేసింది.

ప్రయోగ దశలిలా..

మొదటి దశ: రాకెట్ మొదటి దశ నాలుగు స్ట్రాపాన్ ద్రవ ఇంధన బూస్టర్ల సాయంతో ప్రారంభమవుతుంది. ఒక్కో స్ట్రాపాన్ బూస్టర్‌లో 42.675 టన్నుల ద్రవ ఇంధనం నింపుతారు. కోర్ అలోన్ దశలో 138.1 ఘన ఇంధనంతో మొదటి దశను ఘన, ద్రవ ఇంధనాల మిళితంతో 151.2 సెకన్లలో పూర్తి చేస్తారు. కోర్ అలోన్ దశతో కలిపి 308.5 టన్నుల ద్రవ, ఘన ఇంధనంతో కలగలిపి మొదటి దశ పూర్తవుతుంది.

రెండో దశ: 42.15 టన్నుల ద్రవ ఇంధన సాయంతో రెండో దశను 289.56 సెకన్లలో పూర్తి చేస్తారు.

మూడో దశ (క్రయోజనిక్ దశ): ఈ దశ అత్యంత కీలకం. క్రయోదశలో 14.96 టన్నుల క్రయోజనిక్ ఇంధనం సాయంతో 1106.60 సెకన్లకు మూడో దశను కటాఫ్ చేస్తారు.

ఆ తరువాత జీఎస్ఎల్వీ- ఎఫ్ 16 ఉపగ్రహ వాహక నౌక ద్వారా నిసార్ ఉపగ్రహాన్ని 1115.60 సెకన్లకు (18.59 నిమిషాలు) భూమికి 745 కిలోమీటర్ల ఎత్తులో.. 98.6 డిగ్రీల ఏటవాలులో సూర్య సమకాలిక కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. అక్కడ్నుంచి ఉపగ్రహాన్ని బెంగళూరులోని హసన్‌లో ఉన్న మాస్టర్ కంట్రోల్ సెంటర్ వారు తమ అధీనంలోకి తీసుకుని నియంత్రిస్తారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

ఎలాగైనా అక్కడ పోస్టింగ్ ఇప్పించండి

● స్పెషల్ బ్రాంచిలోకి మళ్లీ రావడానికి పోలీసుల పోటీ

● ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ద్వారా ఒత్తిళ్లు

గ్రావెల్.. స్థానికంతో పాటు తమిళనాడుకు, బియ్యం.. కాకినాడ, కృష్ణపట్నం పోర్టులకు, ఇసుక.. జాతీయ రహదారిపైనే దర్జాగా తమిళనాడుకు అక్రమ రవాణా అవుతున్నాయి. ఇక, సిలికా, క్వార్ట్జ్ ఉండనే ఉన్నాయి. అందుకనే గూడూరు నుంచి తడ, సత్యవేడు వరకున్న పోలీసు స్టేషన్ల పరిధిలో స్పెషల్ బ్రాంచి (ఎస్బీ)లో పనిచేసేందుకు ఎక్కువ మంది పోటీపడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో అడ్డదిడ్డంగా పనిచేసి.. బదిలీ అయిన వారు.. పక్కన పెట్టిన వారూ ప్రజాప్రతినిధులు, తమకు తెలిసిన ఐఏఎస్, ఐపీఎస్ ఉన్నతాధికారుల ద్వారా ప్రస్తుతం ఖాళీగా ఉన్న మూడు పోస్టుల కోసం లాబీయింగ్ చేసుకుంటున్నట్టు తెలుస్తోంది.

ఇటీవల ఎస్పీ హర్షవర్ధనరాజు స్పెషల్ బ్రాంచిని భారీ ప్రక్షాళన చేశారు. ఇందులో కొన్ని స్థానాలకు సబ్ డివిజన్ స్థాయి అధికారులు నియమించుకున్నారు. ప్రస్తుతం సూళ్ళూరుపేట, వెంకటగిరి, సత్యవేడు ప్రాంతాల్లో ఎస్బీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ మూడు ప్రాంతాలకు కలిపి హెడ్ కానిస్టేబుళ్లుగా రావడానికి పలువురు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసి వారూ.. మళ్లీ ఇదే స్థానాలకు రావడానికి ఉవ్విళ్లూరు తున్నారు. ఎందుకంటే వైసీపీ ప్రభుత్వంలో బాగా ఆదాయ వనరులున్న ప్రాంతాలుగా నాయుడుపేట, గూడూరు, సూళ్లూరుపేట, సత్యవేడు పేరుపడ్డాయి. ఇసుక నుంచి బియ్యం వరకు ఇలా ఎన్నో అక్రమ రవాణాలకు ఈ ప్రాంతాలు నెలవు. ఈ క్రమంలో తమ పరిధిలో జరిగే ఇలాంటి అక్రమ రవాణాలు, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలతో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పనితీరుపైనా ఎస్బీలో పనిచేసేవారు నేరుగా ఎస్పీకి రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఇలాంటి సమాచారాన్ని తొక్కిపెడితే అక్రమార్కుల నుంచి ఆయా పోలీసు స్టేషన్లలో పనిచేసే కొందరు అధికారులు వీరిని 'బాగా చూసుకుంటారు'. గతంలో భారీగా లబ్ధి పొందిన వీరంతా మళ్లీ ఈ స్థానాల్లోకి వచ్చేందుకు ప్రజాప్రతినిధులతో పాటు కొందరు ఉన్నతాధికారులతోనూ లాబీయింగ్ చేసుకుంటున్నారు. దీనిపై ఎస్పీ ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

- తిరుపతి (నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ముక్కంటికి బంగారు వజ్రాల నెక్లెస్ వితరణ

శ్రీకాళహస్తి, జూలై 27(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామికి ఆదివారం పట్టణానికి చెందిన శ్రీహరి శంకర్ అవధాని, పద్మావతి 90.680 గ్రాముల బరువైన రూ.12లక్షల విలువ చేసే వజ్రాల నెక్లెస్‌ను వితరణ చేశారు. దీన్ని ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.



ఈవోకు నెక్లెస్ అందిస్తున్న దాత

కోట పీఈటీ సస్పెన్షన్

● హెచ్‌ఎం భారతికి షోకాజ్ నోటీసు జారీ

తిరుపతి(విద్య)/కోట, జూలై 27(ఆంధ్రజ్యోతి): కోట జడ్పీ బాలిక పాఠశాల విద్యార్థులపట్ల అమానవీయంగా ప్రవర్తించి, వారి అనారోగ్యానికి కారణమైన వ్యాయామ ఉపాధ్యాయుడు సుభాన్ (మాబాష)ను డీఈవో కేవీఎన్ కుమార్ సస్పెండ్ చేశారు. ఎస్సీ బాలికల వసతిగృహానికి చెందిన 60 మంది విద్యార్థినులు వైట్ యూనిఫాం వేసుకొని రాలేదని 150 గుంజిళ్లు తీయించి, బెత్తంతో విచక్షణారహితంగా కొట్టడంతో వారు అనారోగ్యం బారినపడి ఆసుపత్రి పాలైన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన డీఈవో, వ్యాయామ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఇంతటి తీవ్రమైన విషయాన్ని తక్షణం పైఅధికారులకు తెలియకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకుగాను పాఠశాల ప్రధానోపాధ్యాయిని భారతికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు డీఈవో తెలిపారు. కాగా వ్యాయామ ఉపాధ్యాయుడు సుభాన్‌పై మూడు సెక్షన్లతో కూడిన కేసులు నమోదు చేసినట్లు వాకాడు సీఐ హుస్సేన్‌బాషా తెలిపారు. మరోవైపు వసతిగృహంలోని విద్యార్థినులను ఆదివారం తెల్లవారుజామునుంచే అధికారులు, ప్రజా సంఘాలు పలు పార్టీల నాయకులు పరామర్శిస్తున్నారు. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన దంపతులు, గూడూరు డీఎస్పీ గీతాకుమారి, సీఐ హుస్సేబాషా తెల్లవారుజాము వరకు వసతిగృహంలోనే ఉంటూ విద్యార్థినులకు వైద్య సేవలు అందించారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ రెండు గంటలపాటు విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి ఓదార్చారు. ఈ ఘటనపై కలెక్టర్, డీఈవోలకు ఎమ్మెల్యే ఫోన్ చేసి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. బీజేపీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, దళిత సంఘాలు, వైసీపీ విద్యార్థి సంఘం నాయకులు, టీడీపీ, టీఎంఎస్ఎఫ్ నాయకులు విద్యార్థినులను పరామర్శించారు. పీడీపై పోక్సో కేసు నమోదు చేయాలంటూ పోలీసుల ఎదుట ఆందోళన చేపట్టారు. సాంఘిక సంక్షేమశాఖ జీడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దారు జయజయరావు, ఎంఈవో మస్తానయ్య, శైలజ విద్యార్థినులను పరామర్శించారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్



తల్లిదండ్రుల వద్ద బోరున విలపిస్తున్న విద్యార్థినులు

జిల్లాకు 36 మంది ప్రొబేషనరీ ఎస్‌ఐలు

● ప్రజలతో సత్సంబంధాలుంటేనే కేసులు ఛేదించగలరన్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూలై 27(ఆంధ్రజ్యోతి): జిల్లాకు కొత్తగా 36మంది ప్రొబేషనరీ ఎస్‌ఐలు వచ్చారు. వీరిలో మహిళా ఎస్‌ఐలు 15 మంది ఉన్నారు. వీరితో అధికారం తిరుపతిలోని పోలీసు అతిథి గృహంలో ఎస్పీ హర్షవర్ధన రాజు సమావేశమయ్యారు. జిల్లాలోని వివిధ స్టేషన్లకు వారిని అలాట్ చేశారు. శిక్షణలో పొందిన అంశాలు, విధి నిర్వహణలో వచ్చే సవాళ్లు వేరుగా ఉంటాయని ఎస్పీ తెలిపారు. ఆ సవాళ్లను అధికమించి ముందుకు వెళ్ళి ప్రజలకు సత్వర న్యాయం అందించే బాధ్యత మనపై ఉందన్నారు. మనకు తెలిసినవన్నీ నిజాలు కావని, తెలియనివి అబద్ధాలు కావన్నారు. నిజా నిజాలు వెలికి తీసేలా దర్యాప్తు చేసి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలన్నారు. పోలీసు శాఖలో హోంగార్డు నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు అందరూ ఒకటే ననే విషయం మరచి పోకూడదన్నారు. ప్రజలతో సంబంధాలు కలిగి ఉంటే ఎంతటి కేసునైనా ఛేదించవచ్చన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని ఆదేశించారు. దేశవ్యాప్తంగా తిరుమల తిరుపతికి ఒక ప్రత్యేకత వుందని మీరు ఇక్కడకు వచ్చి విధులు నిర్వహించడం సంతోషంగా వుందన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినా, పొరబాట్లు చేసినా సహించే ప్రసక్తే లేదన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ అడ్మిన్ వెంకట్రావు, ప్రొబేషనరీ ఎస్‌ఐలు పాల్గొన్నారు.



ప్రొబేషనరీ ఎస్‌ఐల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

'శ్రీశైలం' నుంచి శ్రీవారి సన్నిధికి నీళ్లు

● రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

తిరుమల, జూలై27(ఆంధ్రజ్యోతి): 'శ్రీశైలం రిజర్వాయర్ నుంచి కృష్ణమ్మ జలాలను తీసుకువచ్చి బాలాజీ రిజర్వాయర్లను నింపి, తిరుమల శ్రీవారి సన్నిధికి తీసుకువచ్చి భక్తులకు తాగునీటి అవసరాలను తీర్చనున్నాం. ఈ ప్రయత్నానికి శ్రీవారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించా'నని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి నిమ్మల ఆదివారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. గోవిందుడి ఆశీస్సులతో గత ఏడాది రిజర్వాయర్లన్నీ నిండి ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. గత 25 ఏళ్లలో లేనివిధంగా జూలై నెలలోనే శ్రీశైలం రిజర్వాయర్ నిండిందన్నారు. హంద్రీనీవా ద్వారా 3,850 క్యూసెక్కుల కృష్ణా జలాలను అడివిపల్లి రిజర్వాయర్ నింపి, నీవా కాలువ ద్వారా భవిష్యత్తులో తిరుపతికి తాగు, పారిశ్రామిక అవసరాలకు అందిస్తామన్నారు. శ్రీవారి ఆశీస్సులతో 2027 డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్ట్ పూర్తిచేయాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. రాయలసీమను రత్నాలసీమగా మార్చేదిశగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అమరావతి నిర్మాణం త్వరితగతిన పూర్తయితే విద్య, వైద్య, ఉపాధి అవకాశాలు కలగతాయన్నారు.



కామినేని శ్రీనివాస్, నిమ్మల రామానాయుడు

బాధిత రైతులకు పరిహారం అందజేత



రైతుకు పరిహార చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నాని

పాకాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి, పాకాల మండలాల్లో ఏనుగుల దాడులతో పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పరిహారం చెక్కులను ఎమ్మెల్యే పులివర్తి నాని అందజేశారు. ఆదివారం పులవర్తివారిపల్లెలో చంద్రగిరి మండలం భీమవరం, యల్లంపల్లె, శేషాపురం, చిన్నరామాపురం, బి.కొంగరవారిపల్లె, పూచివారిపల్లె, కొండిరెడ్డి కండ్రిగ పాకాల మండల పరిధిలోని ఈపాలగుట్టపల్లె, పదిపుట్లబైలు 'రైతులకు రూ.25 లక్షల మేర నష్టపరిహారం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. చంద్రగిరి, పాకాల, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం మండలాల్లో తరచూ ఏనుగులు పంటలకు నష్టం కలిగిస్తున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి సమస్య తీసుకువెళ్లామన్నారు. ఆయన బాధిత రైతులవివరాలతో నివేదికలు ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారన్నారు. కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, మండల టీడీపీ నాయకులు రైతులు పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా శ్రీరాములు



చంద్రగిరి, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండల సీపీఐ కార్యదర్శిగా ఎన్.శ్రీరాములు ఏకగ్రీవ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన పార్టీ మండల ప్రథమ మహాసభలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరినాథ్‌రెడ్డి, నాయకులు రాధాకృష్ణలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మండల సీపీఐ కార్యదర్శిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీరాములు మాట్లాడుతూ రానున్న కాలంలో సీపీఐ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



తిరుచానూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): శిల్పారామంలో వారాంతపు సెలవు సందర్భంగా ఆదివారం ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. శివ శాంభవి, శివనృత్య కళా నిలయానికి చెందిన సాయి దీపిక, భావన, గీషణ సాన్వి, లక్ష్మి హన్సిక, నాగభావన, మోహితనాయుడు, పూర్ణచంద్రిక, హరిషికేష్, హేమశ్రీ, పావని, దర్శిక, మోక్ష, గుణశ్రీ, అర్పిత, గుణవర్ధిని తదితరులు గణేష పుష్పాంజలి, బ్రహ్మమొకటే, గణేశస్తుతి, గణనాయక, ఓంశక్తి, అయిగిరి నందిని, అదివో అల్లదివో వంటి గీతాలకు నృత్య ప్రదర్శనలు చేశారు. వారిని శిల్పారామం అధికారులు సూర్యతేజ, రాధాకృష్ణ సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ప్లాటినం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా తులసీరామన్



ప్రమాణ స్వీకారం చేస్తున్న కెఎన్ తులసీరామన్

పాకాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్లాటినం లయన్స్‌క్లబ్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేఎన్ తులసీరామన్, కార్యదర్శిగా ఎస్ దామోదర నాయుడు, ట్రెజరర్‌గా కుప్పుస్వామినాయుడు, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్‌గా జయరామనాయుడులను ఎన్నుకున్నారు. పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ వి.విజయబాస్కర్ రెడ్డి, డాక్టర్ ఎస్.రాజారెడ్డి, ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రమాణ స్వీకారం చేయించారు. బాలికల కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రెడ్డిరామరాజు, బి.చెంగల్రాయనాయుడు, పి.జ్యోతి వెంకటరత్నం, టి.నరేష్‌లు క్లబ్‌లో సభ్యులయ్యారు. బీటెక్ విద్యార్థి ఉదయ్‌కుమార్‌కు ఎం.కుప్పుస్వామినాయుడు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. జెఎన్. బాలాజీ 15 మంది బాలికలకు, కృష్ణమూర్తి ఐదుగురు బాలికలకు యూనిఫాం అందజేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు జి.గురుస్వామినాయుడు, మస్తాన్, జి.రామయ్య, ఆర్వీ ప్రసాద్, అబ్దుల్ ఘనీ, ప్రసాద్, నాగూర్ బాషా పాల్గొన్నారు.

కీళ్ల మార్పిడి తర్వాత కూడా చురుకైన జీవితం



స్పోర్ట్స్ మీట్‌లో కీళ్లమార్పిడి మహిళకు జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ సునందకుమార్‌రెడ్డి, శ్రీధర ముని, తదితరులు

తిరుచానూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స తరువాత కూడా చురుకైన జీవితం సాగించవచ్చని ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సునందకుమార్‌రెడ్డి అన్నారు. తమ ఆస్పత్రిలో గత యేడాది మోకళ్ల కీళ్లమార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న రోగులకు ఆదివారం యాజమాన్యం స్పోర్ట్స్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థోపెడిక్ రోగుల్లో 30శాతం మంది మోకాళ్ల నొప్పులతో వస్తున్నారన్నారు. యువతలోకూడా ఈ సమస్య అధికమవుతోందన్నారు. ఇలాంటి స్పోర్ట్స్ మీట్ ద్వారా మోకాళ్ల శస్త్రచికిత్సపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలుగుతాయన్నారు. ఆపరేషన్ తరువాత రోగులు చిన్న చిన్న వ్యాయామాలు చేస్తే గతంలో మాదిరిగా నిత్యజీవనం సాగించవచ్చన్నారు. ఐఎంఏ తిరుపతి అధ్యక్షుడుడాక్టర్ రామ్‌నారాయణ్‌రెడ్డి, ఆస్పత్రి సీవోవో శ్రీధర్ ముని మాట్లాడారు.

రోడ్డు ఆక్రమించి మరీ కంకర విక్రయాలు



తిరుపతిరూరల్, జూలై27(ఆంధ్రజ్యోతి): గాంధీపురం గ్రామపంచాయతీకి కూతవేటు దూరంలో మదర్‌డెయిరీకి వెళ్లే మార్గంలో కంకరనిల్వల విక్రయంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. క్రయవిక్రయాలకు వచ్చే ట్రాకర్లు, టిప్పర్ల శబ్దాలతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. వాహనాల రద్దీ వల్ల పిల్లలను స్కూళ్లకు తీసుకువెళ్లడం ఇబ్బందిగా ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ పంచాయతీ అనుమతి లేకుండా రోడ్డుపక్కనే కంకర విక్రయించారు. తాజాగా మళ్లీ వ్యాపారాలు సాగిస్తున్నారు. ఈ మార్గంలో టీటీడీ ప్రహరీని ఆనుకుని మట్టిదిబ్బలు, వ్యర్థాలు పడేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించిచర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

హైస్కూల్ గోల్డెన్ జూబ్లీని ఘనంగా నిర్వహించాలి



సమావేశమైన పూర్వ విద్యార్థులు

చంద్రగిరి, జూలై 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల గోల్డెన్ జూబ్లీని ఘనంగా నిర్వహించాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. ఆదివారం పాఠశాల ఆవరణలో 1974-75వ సంవత్సరు పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు సమావేశమయ్యారు. గోల్డెన్ జూబ్లీ అసోసియేషన్ దశాబ్ది వేడుకలను కూడా అదే రోజు(ఆగస్టు 3న) నిర్వహించాలని వీరు నిర్ణయించారు. పీలేరు-రంగంపేట రోడ్డులో ఎస్ ఎస్ గార్డెన్స్‌లో పూర్వ విద్యార్థులు జరిగే సమావేశానికి పూర్వవిద్యార్థులంతా హాజరుకావాలని పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు కోరారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

తడ,జూలై 27(ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తడలో చోటుచేసుకుంది. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన పూజిత(22) శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో పని చేస్తూ తడలో ఉంటోంది. ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె స్నేహితుడు సత్యవేడుకు చెందిన ఆనంద్ రాత్రి ఇంటికి తలుపు తట్టి పిలిచినా స్పందించకపోవడంతో కిటికిలో నుంచి చూడగా పూజిత ఉరేసుకుని ఉండడం గమనించాడు. చుట్టు పక్కల వారి సాయంతో తలుపులు పగలగొట్టి ఆమెను కిందకు దించారు. అప్పటికే మృతి చెంది ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద సీఎస్ విజయానంద్

తిరుచానూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు జేఈవో వీరబ్రహ్మం, అర్చకులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అలాగే మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో ...

తిరుమల, జూలై27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవత్సవ, సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ సభ్యుడు, ఐఎఫ్ఎస్ రిటైర్డ్ అధికారి చంద్ర ప్రకాష్ గోయల్, తెలంగాణ ఎమ్మెల్సీ రవీంద్రారావు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, జూలై27(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర స్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం: రూ.3.41 కోట్లు లభించింది. శనివారం శ్రీవారిని 85,740 మంది భక్తులు దర్శించుకున్నారు.35,555 మంది తలనీలాలు సమర్పించుకున్నారు.

టీటీడీ ఛైర్మన్‌ను కలిసిన కామాఖ్య దేవస్థాన పండితులు



తిరుమల, జూలై27(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడిని ప్రసిద్ధ కామాఖ్య ఆలయ పండితులు దీక్షిత్ ప్రసాద్ శర్మ, రోహిత్ భాయ్ రబాడియా(గౌహతి)లు ఆదివారం తిరుమలలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కామాఖ్య అమ్మవారి ఆలయ విశేషాలను ఛైర్మన్‌కు వివరించారు. ఆలయాన్ని సందర్శించాలని ఛైర్మన్‌ను ఆహ్వానించారు.

ఎమ్మెల్యే నానికి ఎంపీ పరామర్శ



పాకాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మాతృ వియోగంతో బాధపడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నానిని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు ఆదివారం పరామర్శించారు. పులివర్తివారిపల్లెలో లక్ష్మీభారతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎస్ఐ, సీఐపై వ్యక్తిగత దూషణలా..?

- వైసీపీ చిత్తూరు ఇన్‌చార్జి విజయానందరెడ్డి తీరు దురదృష్టకరం
- ఉమ్మడి చిత్తూరు జిల్లా పోలీసు సంక్షేమ సంఘం



మీడియాతో మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్ తదితరులు

చిత్తూరు అర్బన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రెండో పట్టణ ఎస్ఐ రమేష్‌బాబు, సీఐ నెట్టికంఠయ్యపై వైసీపీ చిత్తూరు ఇన్‌చార్జి విజయానందరెడ్డి వ్యక్తిగత దూషణలకు దిగడం దురదృష్టకరమని ఉమ్మడి చిత్తూరు జిల్లా పోలీసు సంక్షేమ సంఘం నేతలు అన్నారు. ఆదివారం స్థానిక పోలీసు అతిథి గృహంలోని కాన్ఫరెన్స్ హాలులో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు ఉదయ్ కుమార్ మాట్లాడుతూ.. చిత్తూరు నగరంలో ఇటీవల రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణనేపథ్యంలో పరిస్థితిని అదుపులోకి తేవడానికి ఎస్ఐ, సీఐలు న్యాయబద్ధంగా పనిచేశారని చెప్పారు. అయితే విజయానందరెడ్డి మాత్రం పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారని వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదన్నారు. ఉద్రిక్త పరిస్థితుల్లోనూ రాజకీయాలకు అతీతంగా పనిచేసిన పోలీసు అధికారులపై వ్యక్తిగత దూషణలకు దిగడం, ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం తగదన్నారు. ఈ వ్యాఖ్యలు న్యాయ పరిరక్షణ విధానాన్ని నిర్వీర్యం చేసే ప్రమాదచర్యగా భావిస్తున్నామన్నారు. ఘర్షణ సమయంలో విద్యుత్ సరఫరాను ఆపేశారని చెప్పారని, అయితే విద్యుత్ సరఫరాకు అంతరాయమే లేదని ఆ శాఖ అధికారులే చెప్పారన్నారు. రాజకీయ నేతలు ఏదైనా ప్రకటన చేసే ముందు వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని, తప్పులు చేసిన వారిని వెనకేసుకొస్తూ చట్టానికి లోబడి పనిచేస్తున్న పోలీసు అధికారులపై అభాండాలు వేయడాన్ని మానుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు గట్టిచర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘ కోశాధికారి ఎం.పరంధామనాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఖాదర్‌బాషా, ఈసీ మెంబరు శరవణ తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లుగా రిజిస్ట్రేషన్ రుసుం ఊసేదీ?

మండలంలో పంచాయతీలకు తప్పని అవస్థలు



పాకాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి మూడేళ్లుగా స్టాంప్ డ్యూటీ రుసుములు పంచాయతీలకు జమకావడంలేదు. దీంతో పంచాయతీల్లో సాధారణ ఖర్చులకూ నిధులు లేక అవస్థలు ఎదురవుతున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ స్టాంప్ డ్యూటీలో పంచాయతీలకు ఒక శాతం, ఒకటి బై ఐదుశాతం మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు జమ చేయాలి. 2022 జూన్ నుంచి మండలంలోని 28 పంచాయతీలకు, మండల పరిషత్‌కు స్టాంప్ డ్యూటీ రుసుం బదిలీ కాలేదు. సుమారు కోటి రూపాయలకు పైగా జమ కావాల్సి ఉంది. పాకాల, దామలచెరువు మేజర్ పంచాయతీలు, ఇరంగారిపల్లె, పంటపల్లె, ఆదెనపల్లె పంచాయతీలకు ఎక్కువ మొత్తం రావలసివుంది. మండల పరిషత్, మేజర్ పంచాయతీల్లో నిధులు లేక అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. పాకాల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో పాకాల, పులిచెర్ల, పెనుమూరు, పూతలపట్టు, ఐరాల, వెదురుకుప్పం మండలాలున్నాయి. ఈ మండలాలలోని ఆయా మండల పరిషత్‌లకు, పంచాయతీలకు, జిల్లా పరిషత్‌కు స్టాంప్ డ్యూటీ రుసుములు ఆరెడు కోట్ల రూపాయలకు పైగా బదిలీ కావాల్సి వుంది. స్టాంపులు రిజిస్ట్రేషన్‌ల శాఖ ఉన్నతాధికారులు, జిల్లా రిజిస్ట్రార్ స్పందించి నిధులు జమచేయాలని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

ముగిసిన మహాభారత ఉత్సవాలు



రామాపురంలో దుర్యోధన వధ ఘట్టాన్ని తిలకిస్తున్న ప్రజలు



దుర్యోధన, భీమ పాత్రధారులు

రామచంద్రాపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): రామాపురం, పరమాల గ్రామాల్లో 18 రోజుల పాటు నిర్వహించిన మహాభారత ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో తిరుమంజనం నిర్వహించి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 10గంటలకు ఆలయాల ప్రాంగణాల్లో దుర్యోధన వధ ఘట్టాలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం మేళ తాళాల నడుమ ఉత్సవమూర్తులను ఊరేగించారు. వందలాదిమంది ఆలయం వద్దకు చేరుకున్నారు. పూజల అనంతరం అగ్ని గుండం వద్ద కొలువుదీర్చారు. పూజారులు అగ్నిలో పూలబంతి విసిరి నిప్పు కణికలను అమ్మవారి ఒడిలో కట్టారు. గోవింద నామ స్మరణల మధ్య పూజారి అగ్నిగుండ ప్రవేశం చేయడంతో భక్తులు ఆయన్ను అనుసరించారు. సోమవారం ఉదయం 10గంటలకు పుష్పయాగం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా ద్రౌపదీ కల్యాణం



భాకరాపేటలో ద్రౌపదీ కళ్యాణ వేడుక

భాకరాపేట, జూలై 27(ఆంధ్రజ్యోతి): భాకరాపేటలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ద్రౌపదీ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ద్రౌపదీ సమేత పాండవుల ఉత్సవ విగ్రహాలను ఉభయదారుల ఇళ్ల వద్దకు తీసుకెళ్లి పూజలు నిర్వహించి ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉభయదారులుగా ఆసనాపురం శ్రీధర్, పసుపులేటి లహరిత, వేహంత్ సాయి, గుహన్ శౌర్య వ్యవహరించారు. **తిరుపతి రూరల్:** దుర్గసముద్రంలోని ద్రౌపదీ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలుగా ఆదెం భువనేశ్వరి, వెంకటరమణారెడ్డి దంపతులు వ్యవహరించారు. మధ్యాహ్నం భాగవతారిణి రాణిరెడ్డి కీచకవధ ఘట్టాన్ని రమ్యంగా వినిపించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఆలయధర్మకర్త మిట్టపల్లి ప్రసాద్‌రెడ్డి, కమిటీసభ్యులు నాదమునిరెడ్డి, రమేష్ రెడ్డి, జ్యోతిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో 'కింగ్‌డమ్' చిత్ర బృందం



'కింగ్‌డమ్' చిత్ర బృందం ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. తిరుపతిలో ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ కార్యక్రమం పూర్తిచేసుకున్న అనంతరం రాత్రి తిరుమల చేరుకున్న హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే, సినీ నిర్మాత నాగవంశీ ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఆలయంలోకి వెళ్లే ముందు, వెలుపలకు వచ్చిన హీరో,హీరోయిన్‌ను చూసేందుకు సినీ అభిమానులు ఎగబడ్డారు. వారితో కలిసి సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు. - **తిరుమల, ఆంధ్రజ్యోతి**

బదిలీ, పదోన్నతి టీచర్లకు జీతాలు చెల్లించండి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

తిరుపతి(విద్య), జూలై 27(ఆంధ్రజ్యోతి): ఇటీవల పదోన్నతులు, బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం తిరుపతి శిశుమందిర్‌లో ఆపస్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల మొదటి వారంలో ఉపాధ్యాయులు పదోన్నతి బదిలీ పొందారని, అయితే క్యాడర్ స్ట్రెంత్, పొజిషన్ ఐడి మంజూరు చేయని కారణంగా వారికి ఇంకా జీతాలు అందలేదని అన్నారు. పీ4 పేరిట ఉపాధ్యాయులు విద్యార్థి కుటుంబాలను దత్తత తీసుకుని ఆర్థిక సహాయం చేయాలన్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆపస్ జిల్లా గౌరవాధ్యక్షుడు మేకల సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి స్వామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దివాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు పద్మావతి వర్సిటీలో 'గోదాంకితావధానం'

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 27 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో సోమవారం గోదాంకితావధానం నిర్వహించనున్నారు. గోదాదేవి అవతారోత్సవం సందర్భంగా శ్రీకృష్ణదేవరాయ సత్సంగ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు పద్మావతి మహిళా యూనివర్సిటీలోని సావేరి సెమినార్ హాలులో ప్రారంభం కానుంది. పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ ఈ అవధానం చేస్తారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, పద్మావతి వర్సిటీ వీసీ వెన్నం ఉమ, స్వర్ణ భారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఇమ్మని దీపా వెంకట్, నాగార్జున వర్సిటీ తెలుగు విశ్రాంతాచార్యులు తమ్మారెడ్డి నిర్మల, పద్మావతి వర్సిటీ ఆంగ్ల విశ్రాంతాచార్యులు టి.అశోకరాణి, లెక్కల ఫౌండేషన్ నిర్వాహకులు పురుషోత్తమ నాయుడు అతిథులుగా పాల్గొంటారు. సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు హాజరుకావాలని పద్మావతి వర్సిటీ తెలుగు విభాగాధిపతి ఆచార్య కొలకలూరి మధు జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

మాజీ ఉపరాష్ట్రపతికి ఘనస్వాగతం

రేణిగుంట, జూలై 27(ఆంధ్రజ్యోతి): మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడికి ఘనస్వాగతం లభించింది. శ్రీవారి దర్శనార్థం ఆదివారం ఉదయం 7.30కు చెన్నై నుంచి వందే భారత్ రైల్లో రేణిగుంట రైల్వే స్టేషన్ చేరుకున్నారు. ఆయనకు టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బి.డి.బాలాజి, పార్టీ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ రెడ్డి, ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు.

తిరుపతి(నేరవిభాగం): తిరుమల శ్రీవారి దర్శనం కోసం ఆదివారం తిరుపతి రైల్వే స్టేషన్‌కు చేరుకున్న గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఎస్పీ హర్షవర్ధనరాజు స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వెళ్లారు.

హెచ్ఎంల సంఘ జిల్లా నూతన కార్యవర్గం




వేణుగోపాల్-వెంకటరమణ

తిరుపతి(విద్య), జూలై27(ఆంధ్రజ్యోతి): స్థానిక టీపీపీఎం హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సంఘ జిల్లా సమావేశంలో 2025-27 విద్యా సంవత్సరాలకు సంబంధించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గాజులమండ్యం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కె.వేణుగోపాల్, కార్యదర్శిగా గూడూరు డివిజన్‌కి చెందిన మధుకర్, గౌరవాధ్యక్షుడిగా రేణిగుంట మండలం ఆర్.మల్లవరం హైస్కూల్ హెచ్ఎం డాక్టర్ కె.వెంకటరమణతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వీరిని పలువురు అభినందించారు.

ముక్కంటి ఆలయంలో రద్దీ

శ్రీకాళహస్తి, జూలై 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. వారాంతం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. 30వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 635 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,460 మంది దర్శించుకున్నారు.

మహనీయుడు ఎన్టీఆర్

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి
- ఒరూరుపేటలో 'అన్న' విగ్రహావిష్కరణ



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యే భానుప్రకాష్, గంధమనేని రాజేష్, టీడీపీ నాయకులు

నింద్ర, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచం నలుమూలలకు చాటి చెప్పిన మహనీయుడు, టీడీపీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు, స్వర్గీయ గంధమనేని రమేష్ చంద్ర ప్రసాద్ కోరిక మేరకు ఆయన ప్రథమ వర్థంతి సందర్భంగా తనయుడు రాజేష్.. నింద్ర మండలంలోని ఒరూరుపేటలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆదివారం ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, టీడీపీ నాయకులతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో మంత్రి ప్రసంగించారు. పేదవాడికి కిలో రెండు రూపాయల బియ్యం అందించిన ఘనత అన్న ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు.

వైసీపీ వారికి తెలిసిందే స్కామ్‌లే..!

వైసీపీ వారికి స్కామ్‌లు తప్ప సంక్షేమం అంటే ఎలా తెలుస్తుందని రామ్‌ప్రసాద్‌రెడ్డి ఎద్దేవా చేశారు. వైసీపీ పాలనలో 'ఆడుదాం ఆంధ్ర'లోనే కాదు అనేక సంక్షేమ పథకాల్లోనూ స్కామ్‌లు చేశారని విమర్శించారు. స్కామ్‌లు చేసిన ప్రతి ఒక్కరి పేరు బయటకు చెప్పాలని ఉంది కానీ.. దీనిపై అసెంబ్లీ కమిటీ వేశామని వారిచ్చే రిపోర్టు 10, 15 రోజుల్లో బయటకు వస్తుందన్నారు. ఎవరైతే దోషులుగా ఉంటారో వారికి శిక్షతప్పదన్నారు. ఇది రాజకీయ కక్ష కాదని.. చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు.

తెలుగువారి ఆత్మగౌరవం

రమేష్ చంద్రప్రసాద్ తనయుడు గంధమనేని రాజేష్ మాట్లాడుతూ.. తెలుగువారి ఆత్మగౌరవం కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించిన ఎన్టీఆర్ ప్రధానమంత్రి స్థాయికి పోటీ పడటం తెలుగుజాతికి గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమాల్లో చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివారి శ్రీనివాసులు, శాప్ ఛైర్మన్ రవి నాయుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మునికృష్ణ, పార్లమెంట్ పార్టీ అధికార ప్రతినిధి చినబాబు, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాయకులు దశరథ వాసు, రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

● అడ్డుకున్న రెవెన్యూ అధికారులు



తిరుపతి అర్బన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): తిరుమల నగర్ పంచాయతీ మంగళం లెక్కదాఖల సర్వే నంబర్ 228లో రెండు సెంట్ల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాకు యత్నించారు. ఆ స్థలంలో జోరుగా నిర్మాణ పనులు జరుగుతుండడంతో స్థానికులు శనివారం ఉదయం రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. వీఆర్‌ఏ అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. ఆధారాలు చూపి నిర్మాణం కొనసాగించాలని పట్టుబట్టాడు. వారి వద్ద ఎలాంటి ఆధారాలూ లేకపోగా కొందరు టీడీపీ నాయకుల పేర్లు చెప్పుకొచ్చారు. అధికారులు అవేమీ పట్టించుకోకుండా పనులు ఆపి ఇక్కడి నుంచి ఖాళీ చేయాలని, లేకుంటే చట్టపరమైన చర్యలకు దిగుతామని గట్టిగా హెచ్చరించడంతో నిర్మాణ సామగ్రిని అక్కడే వదిలిపెట్టి వెళ్లారు. టీడీపీ నేతల పేర్లు చెప్పి కొందరు తరచూ ప్రభుత్వ భూముల ఆక్రమణకు పాల్పడుతున్నారని స్థానికులు అధికారుల దృష్టికి తెచ్చారు.

'వీరమల్లు' పైరసీదారులపై చర్యలు తీసుకోవాలి

- ఈస్ట్ పోలీసులకు జనసేన ఫిర్యాదు



డీఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న కిరణ్‌రాయల్

తిరుపతి (నేర విభాగం), జూలై 27(ఆంధ్రజ్యోతి): పవన్‌కల్యాణ్ హీరోగా నటించిన హరిహర వీరమల్లు చిత్రాన్ని పైరసీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జన సేన నాయకులు తిరుపతి డీఎస్పీ భక్తవత్సలాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కోట్లాది రూపాయల ఖర్చుతో నిర్మించిన చిత్రాన్ని వివిధ యాప్‌ల ద్వారా డౌన్‌లోడ్ చేసి హెచ్‌డీ ప్రింట్ ద్వారా టెలికాస్ట్ చేస్తుండడం బాధాకరమన్నారు. తద్వారా సినిమా యూనిట్‌కు భారీ నష్టం వచ్చే ప్రమాదముందని, దీని వెనుక వైసీపీ ముఖ్య నేతల కుట్ర ఉందని ఆరోపించారు. పవన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకే ఇలాంటి చిల్లర పనులకు పాల్పడుతున్నారని ఎద్దేవా చేశారు.

అందనంత ఎత్తుకు అభినయ ఆర్ట్స్

● ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు
● ముగిసిన జాతీయ నాటకోత్సవాలు






ముగింపు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న రేలంగి నరసింహారావు, బీఎన్.రెడ్డి తదితరులు - విజేతలకు అవార్డులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి, - మొదటి బహుమతి అందుకుంటున్న ఆదికవి నన్నయ్య నాటక కళాకారులు - ఉత్తమ నటుడు అవార్డు అందుకుంటున్న ఖనిత సూర్యనారాయణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 27 (ఆంధ్రజ్యోతి): పాతికేళ్ల నిరంతరాయంగా కళామతల్లి సేవలో తరించిన అభినయ ఆర్ట్స్ అందనంత ఎత్తుకు ఎదిగిందని ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు పేర్కొన్నారు. తిరుపతిలోని మహతి కళాక్షేత్రం వేదికగా తొమ్మిది రోజులుగా చేపట్టిన అభినయ ఆర్ట్స్ 25వ వార్షిక జాతీయ నాటకోత్సవాలు ఆదివారం ముగిశాయి. సమాపనోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన రేలంగి నరసింహారావు మాట్లాడుతూ తిరుపతి అంటే శ్రీవారి తర్వాత అభినయ ఆర్ట్స్ గుర్తుకు వస్తుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలతో తిరుపతి సాంస్కృతిక శోభ పెంపొందుతుందని అభిప్రాయపడ్డారు. రజతోత్సవం చేసుకున్న అభినయ ఆర్ట్స్ స్వర్ణోత్సవం కూడా చేసుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ అభినయ ఆర్ట్స్ కళా రంగానికి చేస్తున్న సేవ భవిష్యత్తులోనూ కొనసాగించాలని ఆకాంక్షించారు. టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, పద్మావతి డిగ్రీ కాలేజీ రిటైర్డు ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి, కవి ధర్మయ్య, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ మృదంగం సుధాకర్, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున మాట్లాడుతూ ఈ నాటకోత్సవాలు ఆధ్యాత్మిక, సామాజిక అంశాలను ప్రతిబింబించాయని తెలిపారు. చివరిగా కళాకారులను నిర్వాహకులు హనుమ అవార్డులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అభినయ ఆర్ట్స్ అధ్యక్షుడు మబ్బు సూర్యనారాయణరెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి బీఎన్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఏనుగు అంకమనాయుడు, కేశవులు నాయుడు, ఎస్పీడీసీఎల్ అధికారి కృష్ణారెడ్డి, పలువురు కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి, భరతనాట్య, జానపద నృత్యం

అభినయ ఆర్ట్స్ నాటకోత్సవాల్లో చివరి రోజైన ఆదివారం వివిధ సంగీత, నృత్య కార్యక్రమాలు హోరెత్తాయి. ఉదయం 9 గంటల నుంచే భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేపట్టారు. అనేక మంది చిన్నారులు వ్యక్తిగత, సామూహికంగా ఈ కళా రూపాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. నాట్య ప్రదర్శనల్లో విజేతలకు కూడా బహుమతులు ప్రదానం చేశారు.

స్వేచ్ఛలో స్వచ్ఛతను చాటిన 'స్వేచ్ఛ' నాటిక



స్వేచ్ఛ అంటే యథేచ్ఛ కాదని స్వేచ్ఛ నాటిక చాటి చెప్పింది. హైదరాబాదుకు చెందిన విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ మహతి కళాక్షేత్రంలో ఆదివారం 'స్వేచ్ఛ' నాటికను ప్రదర్శించింది. పరమాత్ముని శివరాం ఈ నాటకాన్ని రాయగా, బీఎం రెడ్డి దర్శకత్వం వహించారు. స్వేచ్ఛ మంచిదేనని, అయితే మన మనసుకు నచ్చినట్టు, మనకు ఇష్టం వచ్చినట్టు విచ్చలవిడిగా ఇతరులకు ఇబ్బంది కలిగించే స్వేచ్ఛ మంచిది కాదని ఈ నాటకం హితవు పలికింది.





నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్న కళాకారులు

విజేతలు వీరే..

పద్య నాటక పోటీల్లో..

- మొదటి బహుమతి: ఆదికవి నన్నయ భట్టు, శ్రీశ్యామలాంబ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్, విజయనగరం
- ద్వితీయ బహుమతి: ఖడ్గ తిక్కన, శ్రీరామన్ ఫౌండేషన్ సాయిబాబ నాట్యమండలి, విజయవాడ
- తృతీయ బహుమతి: యయాతి నాటకం, సుమిత్ర యూత్ అసోసియేషన్, మధిర
- ప్రత్యేక బహుమతి: జగదేకసుందరి సామా, టీజీవీ కళాక్షేత్రం, కర్నూలు
- ఉత్తమ నటుడు: ఖనిత సూర్యనారాయణ, నన్నయభట్టు పాత్రధారి
- ఉత్తమ నటి: కేవీ పద్మావతి, గోవిందమ్మ పాత్రధారి, నన్నయభట్టు నాటకం
- ఉత్తమ సహాయ నటుడు: నాయని మోహన్, అనంతాచార్యులు పాత్రధారి, శ్రీవేంకటేశ్వర మహాత్మ్యం నాటకం.
- ఉత్తమ సహాయ నటి: లహరి, శర్మిష్ఠ పాత్రధారిణి, యయాతి నాటకం
- ఉత్తమ ప్రతి నాయకి: సురభి ప్రభావతి, సామా పాత్రధారిణి, జగదేకసుందరి సామా నాటకం
- ఉత్తమ పద్య పఠనం: చిలువేరి శాంతయ్య, యయాతి పాత్రధారి, యయాతి నాటకం
- ఉత్తమ హాస్య నటుడు: ఎస్.వెంకటేశ్వరరావు, రాయశృంగారభట్టు పాత్రధారి, ఖడ్గతిక్కన నాటకం
- ఉత్తమ హాస్య నటి: దేవసేన, సఖ్జిక పాత్రధారి, జగదేకసుందరి సామా నాటకం
- ఉత్తమ బాలనటుడు: పి.యశోధర్, బాల వెంకటేశ్వరుడి పాత్రధారి, శ్రీవేంకటేశ్వర మహాత్మ్యం నాటకం
- ఉత్తమ రంగాలంకరణ: ఎన్వీరాజు, సతీష్, ఖడ్గతిక్కన నాటకం
- ఉత్తమ ఆహార్యం: చింతా శ్రీనివాస్, జగదేకసుందరి సామా నాటకం
- ఉత్తమ సంగీతం: సత్యనారాయణశర్మ, యయాతి నాటకం
- ఉత్తమ రచన: శారదాప్రసన్న, ఆదికవి నన్నయభట్టు నాటకం
- ఉత్తమ దర్శకత్వం: పీవీఎస్ కృష్ణ, ఖడ్గతిక్కన నాటకం
- ప్రత్యేక బహుమతి: పులి రామకృష్ణ, బృహస్పతి పాత్రధారి, బ్రహ్మరథం నాటకం
- ప్రత్యేక బహుమతి: సురభి హారిక, కమలాక్షి పాత్రధారిణి, విష్ణువర్ధనుడు నాటకం
- ప్రత్యేక బహుమతి: కుసుమసాయి, కుందమదేవి పాత్రధారిణి, ఖడ్గతిక్కన నాటకం

సాంఘిక నాటిక పోటీల్లో..

- ప్రథమ బహుమతి: రాత, వెలగలేరు థియేటర్స్
- ద్వితీయ బహుమతి: స్వప్నంరాల్చిన అమృతం, చైతన్య కళాభారతి, కరీంనగర్
- తృతీయ బహుమతి: స్వేచ్ఛ, విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్, హైదరాబాదు
- ప్రత్యేక బహుమతి: అమ్మచెక్కిన బొమ్మ, గోవాడ క్రియేషన్స్, హైదరాబాదు
- ప్రత్యేక బహుమతి: ఆచమణం నాటిక, రాధ పాత్రధారిణి
- ఉత్తమ నటుడు: శ్రీనివాసరావు, రాత నాటిక
- ఉత్తమ నటి: సావిత్రమ్మ, జనరల్ బోగీ నాటిక
- ఉత్తమ సహాయ నటుడు: శివ, దేవరాగం నాటిక
- ఉత్తమ సహాయ నటి: మంజుభార్గవి, స్వేచ్ఛ నాటిక
- ఉత్తమ ప్రతి నాయకుడు: గోపరాజు విజయ్, జనరల్ బోగీ
- ఉత్తమ హాస్య నటుడు: శ్రీనివాసరావు, విడాకులు కావాలి నాటిక
- ఉత్తమ క్యారెక్టర్ నటుడు: నరేష్, మహాప్రస్థానం నాటిక
- ఉత్తమ ఆహార్యం: రాత నాటిక
- ఉత్తమ సంగీతం: సారీ రాంగ్ నెంబర్ నాటిక
- ఉత్తమ రంగాలంకరణ: థామస్, విడాకులు కావాలి నాటిక
- ఉత్తమ రచన: పరమాత్ముని శివరాం, స్వప్నం రాల్చిన అమృతం నాటిక
- ఉత్తమ దర్శకత్వం: శ్రీనివాసరావు, రాత నాటిక
- ఉత్తమ బాలనటి: వాగ్దేవి, రాత నాటిక
- ఉత్తమ ద్వితీయ నటి: జ్యోతిరాణి, స్వప్నంరాల్చిన అమృతం నాటిక



జీవితంలో ధ్యానమూ భాగం కావాలి



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఉప విద్యాశాఖాధికారి బాలాజీ, డీఎస్పీ బాలిరెడ్డి, కంచి రఘురాం

తిరుపతి(విద్య), జూలై 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు ధ్యానమూ భాగం కావాలని వక్తలు పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరం 9వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆదివారం తిరుపతి స్పిరిచ్యువల్ సొసైటీ ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేసింది. సొసైటీ అధ్యక్షుడు కంచి రఘురాం ఆధ్వర్యంలో అరబిందో సొసైటీ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.బాలాజీ, తిరుపతి టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ బాలిరెడ్డి, అరబిందో సొసైటీ కార్యదర్శి సూర్యనారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ క్రమశిక్షణ అలవరచుకోవాలని, మానసిక చైతన్యానికి, ఏకాగ్రతకు ధ్యానాన్ని సాధన చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కె. ప్రసాద్‌రాజు, మల్లీశ్వరి, పి.లీల, ఎం. సుబ్రహ్మణ్యం, ప్రవీణ్, కుమార్, కె.శాంతి, వనజ, ఎ.జయరామిరెడ్డి, పి.భాస్కర్ రెడ్డి, పి.జయచంద్రారెడ్డి, జయచంద్ర ఆచారి, అరబిందో సొసైటీ రామచంద్ర, రవి, యశోద పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యమే ఎస్వీఐసీసీఏఆర్ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖ వైద్యులు

తిరుపతి(వైద్యం), జూలై 27(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధితులకు నాణ్యమైన వైద్యం అందించడమే శ్రీవేంకటేశ్వర క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ లక్ష్యమని హరామీ బాబా క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఉమేష్‌మహంత్ శెట్టి అన్నారు. జూపార్కు రోడ్డులోని ఎస్వీఐసీసీఏఆర్‌లో జాతీయ క్యాన్సర్ గ్రిడ్-ఏపీ స్టేట్ చాప్టర్ 3వ వార్షిక సమావేశం ఆదివారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ జాతీయ క్యాన్సర్ గ్రిడ్ రూపొందించిన చికిత్స మార్గదర్శకాలను కేంద్ర ప్రభుత్వం ఏపీలోని అన్ని క్యాన్సర్ కేంద్రాలలో అమలు చేయడమే చాప్టర్ ముఖ్య ఉద్దేశమన్నారు. టీటీడీ భాగస్వామ్యంలో అందరికీ నాణ్యమైన క్యాన్సర్ చికిత్స అందించడం, వైద్య రేడియేషన్ శస్త్ర చికిత్సతో పాటు పాలియేటివ్ కేర్ అందిస్తున్న విషయాన్ని డాక్టర్ల బృందం గుర్తు చేశారు. డాక్టర్ ప్రశాంత్, కాన్ఫరెన్స్ ద్వారా ఏపీ ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, డాక్టర్ కైలాసశర్మ, దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన ఎస్వీయూ అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 27 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఎస్వీ యూనివర్సిటీ ఉన్నతాధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుపతి పర్యటనకు వచ్చిన గవర్నర్‌ను ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా వర్సిటీలో బోధన, పరిశోధన రంగాలకు సంబంధించిన ప్రగతిని గవర్నర్‌కు వివరించారు. గవర్నర్ స్పందిస్తూ ఎస్వీయూ అభివృద్ధికి ప్రభుత్వం, గవర్నర్ కార్యాలయం నుంచి పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉపాధి అవకాశాల కల్పన కోసం పూర్తి స్థాయిలో కృషి చేయాలని వీసీ, రిజిస్ట్రార్‌లకు సూచించారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూలై 27(ఆంధ్రజ్యోతి): బీసీ అధికారి పట్ల దురుసుగా ప్రవర్తించిన తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు గోపాల్ డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లా పంచాయతీ అధికారి బీసీ సామాజిక వర్గానికి చెందిన నాగరాజునాయుడిని జేసీ ప్రభాకర్‌రెడ్డి దుర్భాషలాడుతూ అవహేళన చేయడం సరికాదన్నారు. దీన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ ఉద్యోగుల సమాఖ్య తీవ్రంగా పరిగణిస్తోందని, జేసీపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌యాదవ్, గణేష్‌బాబు, వంకీపురం పవన్, సునీల్‌దత్ పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోసం సామూహిక గాయత్రీ మంత్ర జపం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ఆదివారం సామూహిక గాయత్రీ మంత్ర జప కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సంధ్యావందన అభ్యసన శిక్షణ సమితి తిరుపతి కో-ఆర్డినేటర్ ఖండవిల్లి రాధాకృష్ణ శర్మ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన కె.సి.దాస్ స్మారక సేవా సంస్థ ఆధ్యాత్మిక అనుబంధమైన సంధ్యావందన అభ్యసన శిక్షణ సమితి ఆధ్వర్యంలో అయోధ్యలో 'శతకోటి గాయత్రీ మంత్ర జప యజ్ఞం' నిర్వహించి ఏడాది పూర్తయింది. దీనిని పురస్కరించుకుని కె.సి.దాస్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి పిలుపు మేరకు సామూహిక గాయత్రీ మంత్రజపం చేశారు. తిరుపతి ఖాదీ కాలనీలోని ఆంజనేయ స్వామి ఆలయంలో 11 మంది జపతులు అక్షరకోటి గాయత్రీ జప యజ్ఞం నిర్వహించారు. కో-ఆర్డినేటర్ కె.రాధాకృష్ణ శర్మ, పి.శివప్రసాద్, ఎన్.వి.ఆర్.ప్రసాద్ తదితర సంధ్యావందన అభ్యసన సమితి సభ్యులు మంత్ర జపం చేశారు.

చోరీ సామగ్రి కొనుగోలు చేస్తే చర్యలు



పాత ఇనుప సామాను దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబి

నాయుడుపేట టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): చోరీ సామగ్రి కొనుగోలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు హెచ్చరించారు. పట్టణంలో ఉన్న పాత ఇనుప సామాన్ల దుకాణాలను డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం ఉదయం తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో ఉన్న రాగి, ఇనుప వస్తువులను పరిశీలించారు. కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన బిల్లులను పరిశీలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ చోరీకి గురైన ఇనుము, ఇతర లోహ వస్తువుల అక్రమ వ్యాపారాన్ని అరికట్టేందు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దుకాణ యజమానులకు భద్రతా చర్యలను పటిష్ఠం చేయాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ బాబి, రూరల్ సీఐ సంఘమేశ్వరరావు, నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి ఎస్‌ఐలు ఆదిలక్ష్మి, శ్రీకాంత్, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీ విజేత అనంతపురం



టోర్నీ విన్నర్‌గా నలిచిన అనంతపురం జట్టు

నాయుడుపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-15 బాలికల రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో అనంతపురం జట్టు విజేతగా నిలిచింది. ఏపీ, తిరుపతి, నాయుడుపేట ఫుట్‌బాల్ అసోసియేషన్లు సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి టోర్నమెంట్ ఫైనల్స్ ఆదివారం జరిగింది. ఇందులో అనంతపురం జట్టు విజయం సాధించగా, కడప జట్టు రన్నర్‌గా నిలిచింది. కోచ్ షేక్ గౌస్‌బాషా, తిరుపతి ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రెడ్డెప్ప టోర్నీని పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, బిషప్ మైకెల్ బెన్‌హర్, మధు, ప్రసాద్, మాజీ కౌన్సిలర్ కళాచంద్, లక్ష్మయ్య, రాఖీ, వినోద్, ఎలీషా, కోచ్‌లు రమేష్, వినోద్, అనిల్‌కుమార్, శ్రీనివాసరావు, ప్రసన్నకుమార్, సిరాజ్, ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. ఆదివారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద పట్టణంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రౌడీషీటర్లు ప్రజాజీవనానికి విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత నేరస్థులు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా, చట్టాలను అతిక్రమించి దౌర్జన్యానికి దిగినా ఉపేక్షించేదిలేదన్నారు. కార్యక్రమంలో సీఐ శేఖర్‌బాబు, ఎస్‌ఐలు మనోజ్‌కుమార్, తిరుపతయ్య, సుబ్రహ్మణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల సమస్యల పరిష్కారమే సీపీఐ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న హరినాథరెడ్డి

గూడూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పేదల సమస్యలను పరిష్కరించడమే సీపీఐ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరినాథరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో సీపీఐ నియోజకవర్గ స్థాయి మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడీ వ్యవస్థ ఉన్నంత కాలం సీపీఐ అవసరం ఉంటుందన్నారు. పేదల అభ్యున్నతి కోసం ఎన్నో ఏళ్లుగా సీపీఐ అలుపెరుగని పోరాటాలు సాగిస్తోందన్నారు. ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కేంద్రప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్‌మీటర్ల పేరుతో పేదలపై విద్యుత్‌భారం మోపుతోందన్నారు. ముందుగా స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ప్రభాకర్, చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ, శశికుమార్, కాలేషా, సీవీఆర్ కుమార్, శ్రీనివాసమూర్తి, నారాయణ, రమేష్, మహేంద్ర, గోపి, ప్రసన్న, సునీల్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో ధ్యానమూ భాగం కావాలి

తిరుపతి(విద్య), జూలై 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతోపాటు ధ్యానమూ భాగం కావాలని వక్తలు పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరం 9వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆదివారం తిరుపతి స్పిరిచ్యువల్ సొసైటీ ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేసింది. సొసైటీ అధ్యక్షుడు కంచి రఘురాం ఆధ్వర్యంలో అరబిందో సొసైటీ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.బాలాజీ, తిరుపతి టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ బాలిరెడ్డి, అరబిందో సొసైటీ కార్యదర్శి సూర్యనారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ క్రమశిక్షణ అలవరచుకోవాలని, మానసిక చైతన్యానికి, ఏకాగ్రతకు ధ్యానాన్ని సాధన చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కె.ప్రసాద్‌రాజు, మల్లీశ్వరి, పి.లీల, ఎం.సుబ్రహ్మణ్యం, ప్రవీణ్, కుమార్, కె.శాంతి, వనజ, ఎ.జయరామిరెడ్డి, పి.భాస్కర్ రెడ్డి, పి.జయచంద్రారెడ్డి, జయచంద్ర ఆచారి, అరబిందో సొసైటీ రామచంద్ర, రవి, యశోద పాల్గొన్నారు.

హెచ్‌ఎంల సంఘ జిల్లా నూతన కార్యవర్గం

తిరుపతి(విద్య), జూలై27(ఆంధ్రజ్యోతి): స్థానిక టీపీపీఎం హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సంఘ జిల్లా సమావేశంలో 2025-27 విద్యా సంవత్సరాలకు సంబంధించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గాజులమండ్యం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం కె.వేణుగోపాల్, కార్యదర్శిగా గూడూరు డివిజన్‌కి చెందిన మధుకర్, గౌరవాధ్యక్షుడిగా రేణిగుంట మండలం ఆర్.మల్లవరం హైస్కూల్ హెచ్‌ఎం డాక్టర్ కె.వెంకటరమణతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వీరిని పలువురు అభినందించారు. నూతన కార్యవర్గ ప్రతినిధులు మాట్లాడుతూ సంఘాన్ని మరింత బలోపేతం చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

బైక్‌ను ఢీకొన్న వ్యాన్
ఆర్టీసీ డ్రైవర్ దుర్మరణం



బాలరాజు (ఫైల్‌ఫొటో)

ఓజిలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను మినీవ్యాన్ ఢీకొన్న ఘటనలో ఆర్టీసీ డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం మేరకు.... ఓజిలి మండలం చిల్లమానుచేనుకు చెందిన కొండూరు బాలరాజు(58) గూడూరు ఆర్టీసీ డిపోలో డ్రైవరుగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం విధులకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. పెద్దపరియ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై వెళుతుండగా తిరుపతి నుంచి కోదాడ వెళుతున్న మినీ వ్యాను వెనుక నుంచి వేగంగా ఢీకొంది. బాలరాజుకు తలపై బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడు బాలరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేడు వెంకటగిరికి ఆర్టీసీ ఎండీ రాక

వెంకటగిరి టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు సోమవారం ఉదయం 10గంటలకు వెంకటగిరి డిపోను సందర్శించనున్నట్లు మేనేజర్ రామకృష్ణ తెలిపారు.





వారం రోజుల క్రితం శ్మశాన స్థలం ఇలా ఉండేది - ప్రస్తుతం మట్టితోలిన అక్రమణదారులు

దాతలిచ్చిన స్థలాన్నీ వదల్లేదు!

- రూ.కోటి విలువైన శ్మశాన భూమి ఆక్రమణ
- మట్టితోలి చదును చేస్తున్న అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న అధికారులు

సూళ్లూరుపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో రూ.కోటి విలువ చేసే శ్మశాన స్థలాన్ని కబ్జా చేశారు. మట్టితోలి చదును చేసి ఇంటి ప్లాట్‌గా మార్చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సూళ్లూరుపేట మండలం కేసియన్‌గుంట పంచాయతీ దేగలపాలెం గ్రామానికి శ్మశానం లేకపోవడంతో 2002లో కందలగడ్డల విజయలక్ష్మి ముందుకొచ్చారు. కుదిరి చెరువు సమీపంలో ఉల్పావడవ రోడ్డుకు వెళ్లే మార్గంలో సర్వే నెంబరు 123-1లో 10 సెంట్ల భూమిని దానం చేశారు. నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ చేసి పంచాయతీకి అందజేశారు. ఈ స్థలాన్ని కస్వారెడ్డిపాలెం, దేగలపాలెం గ్రామస్తులు కొన్నాళ్ల శ్మశానంగా వాడుకొన్నారు. 2021లో కేసియన్‌గుంట పంచాయతీలో ఉన్న దేగలపాలెం గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేశారు. కాలక్రమేణా శ్మశానం చుట్టూ వెంచర్లు రావడంతో ఆ ప్రాంతంలో భూములకు గిరాకీ పెరిగింది. పుట్టగొడుగుల్లా వెంచర్లు వెలిశాయి. శ్మశానం పక్కన వరకు ఇళ్ల నిర్మాణాలు సాగాయి. శ్మశాన స్థలం ఖాళీగా ఉండడంతో వైసీపీ హయాంలో అక్రమార్కుల కన్నపడింది. అప్పట్లో గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు దృష్టికి తీసుకెళ్లడంతో చుట్టూ రాళ్లనాటి ముళ్లకంచె వేశారు. ప్రస్తుతం శ్మశానం పక్కన ఉన్న ప్లాట్ల యజమానులు కంచెను తొలిగించి స్థలాన్ని ఆక్రమించారు. మట్టి తోలి చదును వేస్తున్నారు. రూ.కోటి విలువ చేసే శ్మశాన స్థలాన్ని ఆక్రమించుకుని ప్లాట్‌గా మార్చుకుని చదునుచేసే పనిలో ఉన్నా మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దాతలు శ్మశానికి ఇచ్చిన స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి కాపాడాల్సిన అవసరం ఉంది.

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు: విజయశ్రీ

తడ, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పరుగులు పెడుతోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తడకండ్రిగ, గ్రద్దగుంట గ్రామాల్లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఇంటింటికీకి వెళ్లి కరపత్రాలను అందజేసి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. గ్రద్దగుంట పంచాయతీలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి జాడ లేదని, అధ్వానమైన రోడ్లపై జనం నరకయాతన అనుభవించారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి గానే రోడ్లు, మురుగు కాలువలకు మోక్షం లభించిందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని, ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలులోకి రానుందన్నారు. కాగా, ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని పూలవర్షంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్‌నాయక్, టీడీపీ మండల



కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి, నాయకులు నీలకంఠం, బొమ్మన శ్రీధర్, సుదర్శన్, జీవ, జయపాల్, వేలూరు చంద్రయ్య, వేనాటి రాజారెడ్డి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

సంగమేశ్వరాలయంలో కుంభాభిషేకం

కోట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షీదేవి సమేత సంగమేశ్వరాలయంలో కుంభాభిషేకం జరిగింది. అమ్మవారి సకల కలలను కలశములోకి ఆవాహన చేసి అమ్మవారి విగ్రహానికి స్థానచలం చేశారు. సోమవారం నుంచి కుంబాభిషేకాలు పూర్తి అయ్యేవరకు అమ్మవారి ఆలయాన్ని పూర్తిగా మూసివేస్తామని ప్రధానార్చకుడు కార్తీక్‌శర్మ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శశ్యాంక్, టీడీపీ నాయకులు వెంకటకృష్ణారెడ్డి, వీరరాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ

చిల్లకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలో ఆదివారం కారును లారీ ఢీకొంది. పోలీసుల వివరాల మేరకు... నెల్లూరు నుంచి చెన్నై వెళుతున్న కారును అధిగమించే క్రమంలో లారీ అదుపు తప్పి ఢీకొంది. ఈ ఘటనలో కారు స్వల్పంగా దెబ్బతింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోటరీక్లబ్ ఎన్నికలు ఏకగ్రీవం



మధుయాదవ్‌ను అభినందిస్తున్న జలీల్ అహ్మద్, మునిగిరీష్

కోట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కోటలోని పెన్షనర్స్ కార్యాలయంలో ఆదివారం కోట టౌన్ రోటరీ క్లబ్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. రోటరీక్లబ్ గవర్నర్ మునిగిరీష్ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడిగా జలీల్ అహ్మద్, కార్యదర్శిగా ఏవీ సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రటరీగా పవన్‌కుమార్, కోశాధికారిగా మోహన్‌వంశీ, సభ్యులుగా షంషుద్దీన్, మోబీన్, పసుపులేటి కిషోర్, జెన్ని ప్రసాద్, గోపాల్‌రెడ్డి, మధుయాదవ్, కృష్ణమూర్తి, నెల్లూరు మోహన్‌రెడ్డి, రవివర్మ, డిస్ట్రిక్ గవర్నర్‌గా ఎంకే రవీంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరందరినీ టీడీపీ నాయకులు అభినందించారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

తడ,జూలై 27(ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తడలో చోటుచేసుకుంది. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన పూజిత(22) శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో పని చేస్తూ తడలో ఉంటోంది. ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె స్నేహితుడు సత్యవేడుకు చెందిన ఆనంద్ రాత్రి ఇంటికి తలుపు తట్టి పిలిచినా స్పందించకపోవడంతో కిటికీలో నుంచి చూడగా పూజిత ఉరేసుకుని ఉండడం గమనించాడు. చుట్టు పక్కల వారి సాయంతో తలుపులు పగలగొట్టి ఆమెను కిందకు దించారు. అప్పటికే మృతి చెంది ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిత్వ వికాసంపై ప్రేరణ తరగతులు

కోట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కోటలోని జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకులంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రేరణ తరగతులు జరిగాయి. ప్రముఖ సైకాలజిస్టు కర్లపూడి కృష్ణ వ్యక్తిత్వ మానసిక వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ నారాయణరావు, జేవీవీ నాయకులు బాలకృష్ణారెడ్డి, వేణుగోపాల్, రాజేంద్ర పాల్గొన్నారు.

సింగపూర్‌లో సీఎం చంద్రబాబుకు చిల్లకూరువాసుల స్వాగతం

చిల్లకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సింగపూర్ పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు చిల్లకూరు మండలం కమ్మవారిపాళెం గ్రామానికి చెందిన నవీన్‌కుమార్, హిమబిందు స్వాగతం పలికారు. సింగపూర్‌లో నివసిస్తున్న వీరు అక్కడ టీడీపీ కార్యక్రమాలు నిర్వహిస్తూ క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.

గునపాడులో రక్తదాన శిబిరం

చిట్టమూరు, జులై27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గునపాడు ఉన్నత పాఠశాలలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎంఈవో నసీం ఆలీ, రెడ్‌క్రాస్ పీఆర్వో మధుసుదనరావు, కందాటి రామిశెట్టి, హరికృష్ణ, అన్సర్, వినీల్, రమేష్, నాగూరయ్య, మల్లికార్జున్, సురేంద్ర, నారాయణ రావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్

గూడూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నేరాలను నియంత్రించేందుకు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని పట్టణ సీఐ శేఖర్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక రాణిపేటలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పలు ఇళ్లను తనిఖీ చేసి సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐలు మనోజ్‌కుమార్, తిరుపతయ్య, సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ధనలక్ష్మి

నాయుడుపేట, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి చేద్దామని ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి అన్నారు. నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీడీవో సురేష్‌బాబు ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వర్షాల దృష్ట్యా అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు బ్లీచింగ్ వేయాలన్నారు. తాగునీటి పథకాలను పర్యవేక్షించి అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. సమావేశంలో జడ్పీటీసీ కట్టా జ్యోతిరెడ్డి, తహసీల్దారు రాజేంద్రప్రసాద్, ప్రజాప్రతినిధులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు విశేష పూజలు

చిల్లకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరులో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

పేద విద్యార్థులకు సాయం

కోట, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పరిధిలో ప్రతిభ చూపిన కలిగిన పేద విద్యార్థులకు ఆదివారం కోటలోని కోటమ్మ ఆలయ ప్రాంగణంలో నగదు పురస్కారాలు అందజేశారు. పదో తరగతి చదువుతున్న 40మంది విద్యార్థులకు రూ.5వేలు, బీటెక్ చదువుతున్న 20 మందికి రూ.10వేల చొప్పున చెక్కులు అందించారు. కార్యక్రమంలో షిరిడీసాయి అక్షయ సేవాసమితి కన్వీనర్ అల్లం రమణయ్య, వెంకటరమణారెడ్డి, ఆవుల సుబ్బయ్య, బాబురావు, నరేష్, టీడీపీ నాయకులు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సన్మానం

నాయుడుపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆదివారం ప్రపంచ ఆర్యవైశ్య మహాసభలను ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జక్కా సుబ్బరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం కార్యక్రమాలలో కీలకపాత్ర పోషిస్తున్న జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు గూడూరు కిషోర్‌కుమార్, లక్ష్మి దంపతులను సత్కరించారు.

మెరైన్ పోలీస్ స్టేషన్‌లో డీఐజీ తనిఖీలు



మెరైన్ పోలీసు స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఐజీ గోపీనాథ్‌జెట్టి

వాకాడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగరాజపట్నం మెరైన్ పోలీసు స్టేషన్‌ను ఆదివారం డీఐజీ గోపీనాథ్‌జెట్టి పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. తీరంలో భద్రత, నిఘా గురించి ఆరా తీశారు. మెరైన్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. తీరంలో భద్రత కోసం కోస్టల్ సేవలు విస్తృత పరిచేందుకు ప్రయత్నిస్తున్నామని డీఐజీ గోపీనాథ్‌జెట్టి చెప్పారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు అంజిరెడ్డి, సౌమ్య, ఎఎస్‌ఐ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో పంచాయతీ కార్యదర్శి మృతి



యాస్మిన్ (ఫైల్‌ఫొటో)

పెళ్లకూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారంపేట పంచాయతీ కార్యదర్శి ఎండీ యాస్మిన్ (45) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆమె మృతదేహానికి టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి, బంగారుపేట పంచాయతీ సర్పంచు దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్ రెడ్డి, శిరసనంబేడు ఉప సర్పంచు శిరసనంబేటి సురేష్‌రెడ్డితో పాటు సహచర ఉద్యోగులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

నేడు పీఎఫ్‌పై అవగాహన సదస్సు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల భవిష్య నిధి(పీఎఫ్)కి సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం సోమవారం తడ, మంబట్టు ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కృష్ణారావు తెలిపారు. తడ, మంబట్టు ప్రాంతాల్లోని అపాచీ ఫుట్‌వేర్ పరిశ్రమ వద్ద నిధి ఆప్కే నికట్-2 కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. పీఎఫ్ కలిగిన ఉద్యోగులు, కార్మికులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎం చంద్రబాబుతోనే సంక్షేమం



పునబాకలో కరపత్రాలను అందజేస్తున్న సంచి కృష్ణయ్య

పెళ్లకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడుతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని చెంబేడు, పునబాక గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేలవల్లి సిద్దులయ్యానాయుడు, వేలూరు హరి నాయుడు, తాళ్ల యుగంధర్‌గౌడ్, మల్లిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు ఎన్టీఆర్

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి
- ఒరూరుపేటలో 'అన్న' విగ్రహావిష్కరణ

నింద్ర, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచం నలుమూలలకు చాటి చెప్పిన మహనీయుడు, టీడీపీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు, స్వర్గీయ గంధమనేని రమేష్ చంద్రప్రసాద్ కోరిక మేరకు ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా తనయుడు రాజేష్.. నింద్ర మండలంలోని ఒరూరుపేటలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆదివారం ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, టీడీపీ నాయకులతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో మంత్రి ప్రసంగించారు. పేదవాడికి కిలో రెండు రూపాయల బియ్యం అందించిన ఘనత అన్న ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు.



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యే భానుప్రకాష్, గంధమనేని రాజేష్, టీడీపీ నాయకులు

వైసీపీ వారికి తెలిసిందే స్కామ్‌లే..!

వైసీపీ వారికి స్కామ్‌లు తప్ప సంక్షేమం అంటే ఎలా తెలుస్తుందని రామ్‌ప్రసాద్‌రెడ్డి ఎద్దేవా చేశారు. వైసీపీ పాలనలో 'ఆడుదాం ఆంధ్ర'లోనే కాదు అనేక సంక్షేమ పథకాల్లోనూ స్కామ్‌లు చేశారని విమర్శించారు. స్కామ్‌లు చేసిన ప్రతి ఒక్కరి పేరు బయటకు చెప్పాలని ఉంది కానీ.. దీనిపై అసెంబ్లీ కమిటీ వేశామని వారిచ్చే రిపోర్టు 10, 15 రోజుల్లో బయటకు వస్తుందన్నారు. ఎవరైతే దోషులుగా ఉంటారో వారికి శిక్షతప్పదన్నారు. ఇది రాజకీయ కక్ష కాదని.. చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. రమేష్ చంద్రప్రసాద్ తనయుడు గంధమనేని రాజేష్ మాట్లాడుతూ.. తెలుగువారి ఆత్మగౌరవం కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించిన ఎన్టీఆర్ ప్రధానమంత్రి స్థాయికి పోటీ పడటం తెలుగుజాతికి గర్వకారణమని అన్నారు. అంతకుముందు రమేష్ చంద్రప్రసాద్ చిత్రపటం వద్ద నాయకులు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమాల్లో చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివారి శ్రీనివాసులు, శాప్ చైర్మన్ రవినాయుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మునికృష్ణ, పార్లమెంట్ పార్టీ అధికార ప్రతినిధి చినబాబు, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, నాయకులు దశరథవాసు, రవినాయుడు, వెంకటేశ్వరనాయుడు, గంగాధర్‌నాయుడు, గాలి రమేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ సంక్షేమ కమిటీ రాష్ట్ర సభ్యుడిగా ఆదిమూలం



పిచ్చాటూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే ఆదిమూలాన్ని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన విడుదలైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం తనపై నమ్మకం ఉంచి అప్పగించిన పదవికి వన్నె తెచ్చే విధంగా పనిచేస్తానన్నారు. 1975 నుంచి నేటి వరకు దాదాపు 50 సంవత్సరాల తన సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో అహర్నిశలు హరిజన, గిరిజన, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డానన్నారు. ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందించడానికి అనునిత్యం జిల్లా అధికారులతో చర్చించి సత్యవేడు నియోజక వర్గ అభివృద్ధికి శ్రమించానన్నారు. కమిటీ సభ్యుడిగా నియమించిన సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలానికి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

ముక్కంటి ఆలయంలో కొనసాగిన రద్దీ



శ్రీకాళహస్తి, జూలై 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. వారాంతం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంత రాలయ దర్శనం 635 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,460, రూ.50 ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,088 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహు కేతు టిక్కెట్ల ద్వారా 2,794మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 947, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 355, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 250, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 94మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 22,515 విక్రయించినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

సురక్షిత డిజిటల్ పరివర్తనపై శిక్షణ



అవగాహన శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

ఏర్పేడు, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో కుటుంబ బలోపేత కార్యక్రమం కింది పిల్లలకు సైబర్ భద్రత, సురక్షిత డిజిటల్ పరివర్తనపై ఆదివారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బాలల రక్షణ సైబర్ భద్రతా నిపుణుడు రత్నశేఖర్ ఆధ్వర్యంలో కథలు, ఉదాహరణలు, వీడియోల ద్వారా ఆన్‌లైన్ మోసాల పట్ల ఎలా జాగ్రత్తగా ఉండాలో అవగాహన కల్పించారు. పల్లం, అక్కుర్తి గ్రామాల నుంచి సుమారు 100మంది చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొబైల్, ఇంటర్నెట్, సోషల్ మీడియాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత సమాచారం రక్షణపై అవగాహన కల్పించారు. సత్యనారాయణ, మునిరత్నం, యానిమేటర్లు పాల్గొన్నారు.

టీడీపీతోనే బడుగుల సంక్షేమం



శ్రీకాళహస్తి పట్టణం, గోవిందవరంలలో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాలు

శ్రీకాళహస్తి, జూలై 27(ఆంధ్రజ్యోతి): బడుగుల సంక్షేమానికి టీడీపీ కృషి చేస్తోందని ఆ పార్టీ బీసీ విభాగ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 4వ వార్డులో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, వన్నియ కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు సుబ్బయ్య, మునిరాజాయాదవ్, ఎంఎస్‌రెడ్డి, రామ్మూర్తి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవరం పంచాయతీలో ఆదివారం ప్రభుత్వ సంక్షేమ పథకాలపై టీడీపీ నాయకులు ప్రచారం చేపట్టారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచి పథకాల గురించి వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధనంజయలునాయుడు, నాగరాజునాయుడు, గురవారెడ్డి, పొన్నారావు, చిరంజీవులునాయుడు, భూపతినాయుడు, శివశంకర్‌రెడ్డి, హేమాక్షి రాయల్, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

సత్యవేడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యవేడు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో గత నెల రోజులుగా జరుగుతన్న క్రికెట్ టోర్నమెంట్‌లో తమిళనాడు మాదరపాకం జట్టు విజేతగా నిలిచాంది. ఈ టోర్నమెంట్‌లో 16 జట్లు పాల్గొనగా నాగలాపురం, మాదరపాకం జట్లు ఫైనల్‌కు చేరాయి. ఇందులో మాదరపాకం జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం సాయంత్రం విజేత జట్టుతో పాటు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు బహుమతులను అందించారు. విజేతలకు టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ శివకుమార్ మొదటి బహుమతి కింద రూ.20వేలు అందించగా, టీడీపీ నాయకుడు చికెన్ చిన్న (మురళి) రెండో బహుమతి కింద రూ.15వేలు, మరో టీడీపీ నేత ఈశ్వరయ్య మూడో బహుమతి కింద రూ.10వేలను అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు దావీద్, ముఖేష్, సీమాన్ బాల, సూర్య తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

ప్రమాదాలకు నిలయంగా మలుపులు



ప్రమాదకరంగా రామరాజుకండ్రిగ మలుపు - బట్టీకండ్రిగ వద్ద మలుపులో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

వడమాలపేట, జూలై 27(ఆంధ్రజ్యోతి): మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు లేక పోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని ప్రధాన రహదారి తడుకు ఆర్‌ఎస్ నుంచి సీతారామపురం, అప్పలాయగుంట, రామాపురం మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే సింగిల్ రోడ్డు మలుపులతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా తడుకు రైల్వేస్టేషన్ నుంచి సీతారామపురం వరకు 6 కిలోమీటర్ల మేరకు ఉన్న రోడ్డులో సుమారు ఇరవై ప్రమాదకర మలుపులున్నాయి. దీనికి తోడు కొన్నేళ్లుగా రోడ్డుకు ఇరువైపులా ముళ్లచెట్లను తొలగించకపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. తమిళనాడు నుంచి అప్పలాయగుంట మీదుగా తిరుమలకు పాదయాత్రగా వెళ్లే భక్తులు ఈ రోడ్డు మీదుగా భయం గుప్పిట్లో పాదయాత్ర చేస్తున్నారు. శనివారం ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించే భక్తులు తమిళనాడు, పుత్తూరు పరిసర ప్రాంతాల నుంచి తడుకు ఆర్‌ఎస్, సీతారామపురంమీదుగా అప్పలాయగుంటకు వాహనాల్లో వెళ్తుంటారు. మలుపులతో పాటు ముళ్ళ కంపలతో రోడ్డు తెలియక ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించక ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని ఈ రోడ్డులో మలుపుల వద్ద ప్రమాదాల నివారణ కోసం సూచికబోర్డులు ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

మాజీ సర్పంచుకు ఎమ్మెల్యే పరామర్శ



పుత్తూరు అర్బన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమల కుప్పం మాజీ సర్పంచ్ గాలి రామచంద్రనాయుడు సతీమణి గాలి సుబ్బరత్నమ్మ ఇటీవల మృతి చెందారు. ఆదివారం ఆమె కర్మక్రియలకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హాజరయ్యారు. రామచంద్రనాయుడిని పరామర్శించారు. ధైర్యంగా జీవితాన్ని గడపాలంటూ ఆత్మస్థైర్యాన్ని నింపారు.

క్రమశిక్షణతో మెలగండి

రేణిగుంట జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలో నేరచరిత్ర కలిగిన వారు క్రమశిక్షణతో మెలగాలని అర్బన్ సీఐ జయచంద్ర సూచించారు. ఆదివారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండల పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎక్కడైనా సెటిల్మెంట్లు, బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విలీనం... విద్యకు చిన్నారులు దూరం!



పల్లంపేట పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు(ఫైల్ ఫొటో)

ఏర్పేడు, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేయాలని ప్రతిష్ఠాత్మకంగా నిర్ణయం తీసుకుంది. రెండు కిలోమీటర్ల లోపు పూర్తి సౌకర్యాలతో ఉన్న పాఠశాలలో మరో బడిని విలీనం చేయాలని నిర్ణయించింది. అయితే దీన్ని కొన్ని గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు వ్యతిరేకిస్తున్నారు. దీంతో చిన్నారులను పాఠశాలలకు పంపడం లేదు. ఈ క్రమంలో అభంశుభం తెలియని పిల్లలు చదువుకు దూరమవుతున్నారు. ఏర్పేడు మండలం పల్లంపేట ప్రాథమిక పాఠశాలను పల్లం దళితవాడలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో విలీనం చేశారు. దీంతో పల్లంపేటలో చదువుతున్న 3, 4, 5 తరగతుల విద్యార్థులు పల్లం మోడల్ స్కూల్‌కు వెళ్లాల్సి ఉంది. వేసవి సెలవుల తరువాత పాఠశాల పునఃప్రారంభమైనప్పటికీ బడికి పంపించకపోగా ఈనెల 19న విలీన ప్రక్రియను నిలుపుదల చేయాలంటూ పాఠశాలకు తాళాలు వేసి కంచెను ఏర్పాటు చేశారు. విధులకు హాజరవుతున్న ఉపాధ్యాయులను అడ్డుకుంటున్నారు. చేసేది లేక ఉపాధ్యాయులు పాఠశాల సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో కూర్చుంటున్నారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదంటూ గ్రామస్తులు మండిపడుతున్నారు. అయితే పల్లంపేట ప్రాథమిక పాఠశాలకు తాళం వేస్తూ పదిరోజులుగా ఉపాధ్యాయులను అడ్డుకుంటున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి విద్యాశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.

రాష్ట్ర గవర్నర్‌కు ముక్కంటి ప్రసాదాలు



గవర్నర్‌తో మస్తానయ్య

శ్రీకాళహస్తి, జూలై 27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానంతరం ఆదివారం తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ సభ్యుడు, న్యాయవాది వి.మస్తానయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. గవర్నర్‌ను ముక్కంటి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు సాదర వీడ్కోలు లభించింది. ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు జేసీ శుభం భన్సల్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజు, ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి సాదర వీడ్కోలు పలికారు.

అంకాలమ్మకు సారె సమర్పణ

శ్రీకాళహస్తి, జూలై 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీవీరోడ్డులో కొలువై ఉన్న అంకాలమ్మ జాతర సందర్భంగా ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు సారె సమర్పించారు. గైక్వాడ్ కార్తీక్‌రావు, సల్వాడే ప్రసన్నరావు, జి.మురళి, మోహితే పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరి ఊరేగింపు

పిచ్చాటూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంచురాజు కండ్రిగ లో ఆదివారం చౌడేశ్వరి దేవి జ్యోతుల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో జరిగింది. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి ట్రాక్టర్‌పై మేళతాళాలు. బాణసంచా పేలుళ్ళతో ఊరేగించారు.

మాజీ ఉపరాష్ట్రపతికి ఘనస్వాగతం

రేణిగుంట, జూలై 27(ఆంధ్రజ్యోతి): మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడికి ఘనస్వాగతం లభించింది. శ్రీవారి దర్శనార్థం ఆదివారం ఉదయం 7.30కు చెన్నై నుంచి వందే భారత్ రైల్లో రేణిగుంట రైల్వే స్టేషన్ చేరుకున్నారు. ఆయనకు టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బి.డి.బాలాజి, పార్టీ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ రెడ్డి, ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు స్వాగతం పలికారు.

అడుగడుగునా గుంతలతో...



రొచ్చుగా మారిన చిన్నాయుగుంట రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నాయగుంట రోడ్డు వర్షాలకు చిత్తడిగా మారి ప్రయాణానికి ఇబ్బందిగా మారింది. జంబుగోళం రోడ్డు నుంచి చిన్నాయ్యగుంట రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ రోడ్డుకు గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో అడుగడుగున గుంతలు ఏర్పడి ప్రయాణం దుర్భరంగా మారింది. వారం నుంచి వర్షాలు కురుస్తుండడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. రోడ్డులో వర్షపు నీరు నిలిచి ఎక్కడ గుంత ఉందో తెలియక పలువురు వాహన చోదకులు ప్రమాదాలకు గురి అవుతున్నారు. రోడ్డుకు కనీస మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించాల్సి ఉంది.

వైభవంగా ఆండాల్ తిరువడిపురం ఉత్సవం



నారాయణవనం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని కల్యాణ వెంకన్న ఆలయంలో ఆండాల్ తిరువడిపురం ఉత్సవాల్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం ఆలయంలోని ఆండాల్ అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యపూజా కైంకర్యాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆండాల్ తిరువడిపురం అంటే ఆండాల్ అమ్మవారి జయంతిగా ఉత్సవాలు చేసుకోవడమని అర్చకులు తెలిపారు. అమ్మవారికి ఉదయం తిరుమంజనం, సాత్తుమొర కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక అలంకరణలో అమ్మవారు పుర వీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయాధికారి నాగరాజు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం: సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న హరినాథ రెడ్డి

ఏర్పేడు, జూలై 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ అలుపెరగని పోరాటం చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు హరినాథరెడ్డి అన్నారు. ఏర్పేడు పట్టణంలో ఆదివారం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ... ఇల్లు లేనిపేదలను గుర్తించి ఇంటిస్థలాలు పంచిన ఘనత సీపీఐకే దక్కిందన్నారు. ఇక విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ధరలు పెంచేసిందన్నారు. అదే విధంగా స్మార్ట్‌మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేస్తామన్న కూటమి ప్రభుత్వం ప్రస్తుతం మాట మార్చడం సరైన పద్ధతికాదన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఇళ్లను పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మురళి, రాధాకృష్ణ, జనమాల గురవయ్య, వైఎస్ మణి, మించల శివకుమార్, ఏఐటీయూసీ నాయకులు మల్లికార్జున, కార్తీక్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి చారులత తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి



రేణిగుంట, జూలై 27(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని గుర్తు తెలియని ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం గుత్తివారిపల్లి వద్ద జరిగింది. అర్బన్ సీఐ జయచంద్ర తెలిపిన వివరాలు... రేణిగుంట-నాయుడుపేట జాతీయ రహదారిలోని గుత్తివారిపల్లి సమీపంలో శ్రీకాళహస్తి నుంచి రేణిగుంటకు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని శ్రీకాళహస్తికి వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో గుర్తు తెలియని ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందగా బైక్ నుజ్జునుజ్జైంది. మృతదేహాన్ని రుయా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జైన బైక్



ఏర్పేడు, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మేర్లపాక టోల్‌ప్లాజా సమీపంలో రెండుకార్లు ఢీకొన్నాయి. ఈ నేపథ్యంలో రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన స్కూటర్‌పై ఒక కారు దూసుకెళ్లింది. ఈ ఘటన లో స్కూటర్ నుజ్జునుజ్జు అయింది. ఈ ఘటనపై ఎలాంటి కేసు కాలేదు.

సంక్షేమ హాస్టళ్లను శుభ్రంగా ఉంచుకోవాలి

పిచ్చాటూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంక్షేమ హాస్టళ్లను శుభ్రంగా ఉంచుకోవాలని పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ధనుష్ సూచించారు. ఆదివారం పిచ్చాటూరులోని బీసీ బాలికలు, ఎస్సీ బాలుర సంక్షేమ హాస్టళ్లతో పాటు వెంగళత్తూరు ఎస్సీ బాలుర సంక్షేమ హాస్టల్ సీహెచ్‌వో శివయ్య, ఏఎన్ఎం సుమతి, ఎంఎల్‌హెచ్ పి.శరత్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వంట గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. హాస్టల్ వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చెంగాళమ్మకు ఎదురు పొంగళ్లు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 27: మండలంలోని నీర్పాకోటలో కొలువై ఉన్న చెంగాళమ్మ జాతరలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామి, వినాయకస్వామి ఆలయాల్లో, నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అంబుళ్లను పోసి ఎదురు పొంగళ్లుపెట్టారు. అనంతరం రాత్రి చెంగాళమ్మ ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించారు.

చేతి బోరు ఏర్పాటు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఈబీసీ కాలనీలో చేతి బోరు ఏర్పాటు చేశారు. కాలనీ సమీపంలో ఉండే శ్మశానంలో క్రతువులు కోసం అవసరమైన నీటికోసం ఇబ్బంది పడేవారు. బోరు వేసి చేతిపంపును బిగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఉప సర్పంచ్ మునిరాజా, కార్యదర్శి చిరంజీవి, కూలీలు పాల్గొన్నారు.

బాలసదన్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, జూలై 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలసదన్‌లో అవుట్ సోర్సు, పార్ట్‌టైం ప్రాతిపదికన ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు బాలసదన్ సూపరింటెండెంట్ తెలిపారు. 2 కుక్ పోస్టులు, 2 హెల్పర్, హెల్పర్ కం నైట్ వాచ్‌మన్, హౌస్ కీపర్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ కం మ్యూజిక్ టీచర్, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కం యోగా టీచర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన వారు సంబంధిత వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాలను పొందాలన్నారు. వివరాలకు నెం.9000106774లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ముక్కంటి సేవలో మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



శ్రీకాళహస్తి, జూలై 27(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని ఆదివారం మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మణీంద్రమోహన్ శ్రీవాస్తవ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయుడి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

అర్చకులపై వేధింపులు మానుకోవాలి

శ్రీకాళహస్తి, జూలై 27(ఆంధ్రజ్యోతి): అర్చకులు, వేదపండితులపై ఆలయ అధికారులు వేధింపులు మానుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య అర్చక అధ్యక్షుడు పాలూరి నరసింహమూర్తి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా ఉరుకుంద ఈరన్నస్వామి క్షేత్రంలో ఆలయ అధికారుల వేధింపులతో అర్చకుడు వీరన్న ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల అర్చకులపై దాడులు పెరిగాయని ప్రభుత్వం స్పందించాలని కోరారు.

ఉపాధి కూలి చెల్లించండి

కేవీబీపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): తమకు కూలి డబ్బులు చెల్లించాలని ఉపాధి కూలీలకు కోరుతున్నారు. 12 వారాలుగా కూలి చెల్లించకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్టు పేర్కొన్నారు. దీంతో కుటుంబ పోషణ కష్టతరమైందన్నారు. వర్షాలు కురిస్తే చెరువులో మట్టి తవ్వడం ఇబ్బంది అవుతుందని ఎండను సైతం లెక్క చేయకుండా పని చేస్తున్నా కూలి జమ చేయడం లేదంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కూలి డబ్బులు చెల్లించాలని కూలీలు కోరుతున్నారు.